క్లుప్తంగా

నేడు మేకా ప్రతాప్ ఎన్నికల ప్రచారం

చాట్రాయి: మండలంలోని మంకొల్లు, చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు మంకొల్లు, చీపురుగూడెం, కోటపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జరుగుతుందని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

మేరీమాత ఆలయ వార్షికోత్సవం



చంద్రాల(మైలవరం): మేరీ మాత ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ప్రార్థించామని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని మేరీ మాత ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని సర్నాల తిరుపతి రావు ఆదివారం ప్రారంభించారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం విశ్వాసులను ఆప్యాయంగా పలుకరిస్తూ భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పామర్తి శ్రీనివాసరావు, నాయకులు జొన్నలగడ్డ గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జి. వెంకట్రావు, యరమల రామ్ భూపాల్‌రెడ్డి, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ మంగా కుమారి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఆర్థిక సాయం అందజేత




మైలవరం: మైలవరం గ్రామానికి చెందిన దబ్బిర రాంబాబు కుమారుడు దబ్బిర నరేంద్ర గుంటూరులోని కాటూరి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. నరేంద్ర చదువు నిమిత్తం గ్రామానికి చెందిన దివంగత సూరానేని సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు హైదరాబాద్ వాస్తవ్యులు సూరానేని మోహనరావు దంపతులు, మైలవరం గ్రామస్తులు సూరానేని కృష్ణకిశోర్ దంపతులు సంయుక్తంగా కళాశాల ఫీజు నిమిత్తం రూ.35,000, ద్వితీయ సంవత్సరం ఫీజు నిమిత్తం రూ. 35,000 ఆర్థిక సహాయన్ని ఆదివారం వారికి అందజేశారు. విద్యార్థి నరేంద్ర ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు ప్రతి సంవత్సరం రూ.35,000 ఆర్థిక సహాయం చేస్తామని దాతలు తెలిపారు.

బాల్యమిత్రుడి కుటుంబాన్ని ఆదుకున్న స్నేహితులు



తిరువూరు: మండలంలోని మల్లేల శివారు గొల్లగూడెంలో ఇటీవల మృతిచెందిన తమ బాల్యమిత్రుడి కుటుంబానికి తిరువూరు పూర్వ విద్యార్థుల సంఘం (దోస్త్ 1987–89) ఆదివారం తమవంతు సహాయం అందజేసింది. తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన మల్లెంపాటి నరేంద్ర అనారోగ్యంతో మృతిచెందగా, ఆ కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండటంతో పూర్వవిద్యార్థుల సంఘ సభ్యులు కొంత నగదు, నిత్యావసర సరుకులు, బియ్యం అందజేశారు. ఎల్లప్పుడూ తాము అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు చిత్తలూరి సోమశేఖర్, పరసా నెహ్రూజీ, యలమంచిలి నాగమల్లేశ్వరరావు, మామిళ్ల గోపి, కొత్తగుండ్ల సురేష్‌గుప్తా, షావల్, కొత్తూరు భరత్, గోదా స్వామి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



చాట్రాయి: చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించే వాహనాల తనిఖీలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల పరిశీలకుడు టి.శ్రీధర్ అన్నారు. కృష్ణారావుపాలెం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును ఆదివారం ఆయన పరిశీలించారు. నగదు, మద్యం అక్రమ తరలింపును అడ్డుకోవాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఏఎ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం

- స్థానికుడిని.. ఏ సమయంలో వచ్చినా అందుబాటులో ఉంటా
- సహజ వనరుల దోపిడీ కోసమే స్థానికేతరులు ఇక్కడ పోటీ
- మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు



మైలవరంలో కరపత్రాలు పంపిణీ చేసి పథకాలు వివరిస్తున్న తిరుపతిరావు



కొటికలపూడిలో ప్రచార వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న తిరుపతిరావు



రాయనపాడులో ప్రచారం చేస్తున్న సర్నాల నాగలక్ష్మి

మైలవరం: మన మైలవరాన్ని మనమే అభివృద్ధి చేసుకుందామని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మైలవరం టౌన్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోను గ్రామస్తులకు వివరించారు. మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చి ముఖ్యమంత్రిగా జగనన్నను మరోసారి ఆశీర్వదిస్తే మరిన్ని మెరుగైన సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. ముఖ్యమంత్రి జగనన్న బడుగు, బలహీన వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మేనిఫెస్టోను తయారు చేశారని, గత ఎన్నికల్లో మేనిఫెస్టోలోని అంశాలను నూరు పాళ్లు అమలు చేశారని చెప్పారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అంది, అభివృద్ధి జరిగితేనే తనకు ఓటు వేయాలని అడిగిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని చెప్పారు. తాను ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగానని, మీ మధ్యలోనే ఉంటున్నానని, ఏ సమయంలో వచ్చినా తాను అందరికీ అందుబాటులో ఉంటానని చెప్పారు. స్థానికేతరులు మైలవరంలో గెలిచి ఇక్కడి సహజ వనరులను దోచుకుపోతున్నారని చెప్పారు. మైలవరం ప్రజలకు సేవ చేసుకుని పుట్టిన గడ్డను అభివృద్ధి చేసుకునే అవకాశాన్ని కల్పించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేగా తనకు, విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)కి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించి జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాట తప్పని నేత సీఎం జగన్..

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. అన్నివర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. మండలంలో కొటికలపూడి, జూపూడి, గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. తిరుపతిరావు మాట్లాడుతూ మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. మోసాలకు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీ నాయకులు నిలుస్తారన్నారు. దోచుకుని దాచుకోవడమే టీడీపీ వారి లక్ష్యమని చెప్పారు.

సీఎం వైఎస్ జగన్ అమలు చేయగలిగినవి మాత్రమే చెబుతారని, ఇచ్చిన మాట తప్పకుండా నెరవేర్చుతారనే నమ్మకం ప్రజల్లో ఉందని స్పష్టం చేశారు. ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అభ్యర్థించారు. సర్పంచి రెంటపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వీరులపాడు జెడ్పీటీసీ అమర్లపూడి కీర్తి సౌజన్య, జి.కొండూరు జెడ్పీటీసీ మందా జక్రధరరావు, జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు ఎస్.శివశంకరరావు, మండల కన్వీనర్ బొంత సాంబశివరావు, చింకా శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బాణావత్ బాలనాగమ్మ, బండి జోత్స్న బాలాజీ, గ్రామ కన్వీనర్లు పాల్గొన్నారు.

సర్నాల నాగలక్ష్మి ప్రచారం..

రాయనపాడు(విజయవాడరూరల్): వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావుకు మద్దతుగా ఆయన సతీమణి నాగలక్ష్మి, ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్ర గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి రాయనపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితే పథకాలు కొనసాగుతాయని వారు ప్రతి ఇంటికి వెళ్లి బ్రోచర్లను అందజేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని)లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. ఎస్సీ కాలనీ నుంచి ప్రారంభమైన ప్రచారంలో తొలుత జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. అశోక్‌నగర్, శాంతినగర్, బీసీ కాలనీ, ఎస్టీ కాలనీ, మెయిన్ విలేజీలో విస్తృతంగా పర్యటించారు. గ్రామ కన్వీనర్ పోలసాని వాసు ఆధ్వర్యంలో నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు సీఎం జగన్

జ్యేష్ఠ రమేష్‌బాబు తనయుడు శ్రీనాథ్



గుంటుపల్లిలో ప్రచారం చేస్తున్న జ్యేష్ఠ శ్రీనాథ్, నాయకులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): విశ్వసనీయతకు మారుపేరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్ బాబు తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు జ్యేష్ఠ శ్రీనాథ్ అన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన 2024 మేనిఫెస్టో దీనిని స్పష్టం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి జరిగేది మాత్రమే చెబుతారని, ఆయన చెబితే ఖచ్చితంగా చేసి తీరుతారని ప్రజలు విశ్వసిస్తున్నారని చెప్పారు. గుంటుపల్లి ఎస్సీ ఏరియాలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీనాథ్ మాట్లాడుతూ 2019లో ప్రకటించిన మేనిఫెస్టో 99 శాతం అమలు చేశారని చెప్పారు. అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చేలా రూపొందించిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారన్నారు. ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావును గెలిపించాలని కోరారు. ఓటర్లకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఉప సర్పంచి చాట్రగడ్డ మేరి, నాయకులు గోగినేని సాంబశివరావు, నందు, కోటేశ్వరరావు, రెంటపల్లి మమత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కొనసాగింపే లక్ష్యం

- తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు
- ముష్టికుంట్ల, వామకుంట్లలో ముమ్మరంగా ప్రచారం



ముష్టికుంట్ల గ్రామంలో ప్రచారం చేస్తున్న స్వామిదాసు

తిరువూరు: రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలను సక్రమంగా అందించడమే వైఎస్సార్ సీపీ ప్రధాన లక్ష్యమని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు మండలంలోని ముష్టికుంట్ల, వామకుంట్ల గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామస్తులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రకటించిన మేనిఫెస్టో పేదలకు మేలు చేసేదిగా ఉందని చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన ఆరు హామీలు ప్రజలు నమ్మకపోవడంతో జీర్ణించుకోలేక కొందరు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో గురించి తప్పుడు ప్రచారం చేయాలని చూస్తున్నారని స్వామిదాసు ధ్వజమెత్తారు. గతంలో ఉన్న నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా మరింత ప్రయోజనం కల్పించేందుకు వైఎస్సార్ సీపీ మేనిఫెస్టో ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అమలు చేయదగిన వాగ్దానాలే మేనిఫెస్టోలో పొందుపరిచారని చెప్పారు. పక్క రాష్ట్రాల మేనిఫెస్టోలు కాపీ కొట్టే తెలుగుదేశం పార్టీకి వైఎస్సార్ సీపీని విమర్శించే అర్హతే లేదన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమికి ఓటమి ఖాయమని, వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాలు గెలుచుకోవడం ఖాయమని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు గద్దె అంజయ్య, హనుమంతరావు, రామ్మోహన్, బండి రవికుమార్, మోదుగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారం పేరుతో ఉన్మాద చర్యలు

- గంగినేని గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాను తగులబెట్టిన టీడీపీ కార్యకర్త
- రెచ్చగొట్టే వ్యాఖ్యలతో గ్రామంలో ప్రచారం

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ ప్రచార కార్యక్రమాలలో టీడీపీ శ్రేణుల ఉన్మాద చర్యలు శ్రుతిమించుతున్నాయి. ఇబ్రహీంపట్నం మండల పరిధి కొండపల్లిలో శనివారం సాయంత్రం ముస్లింలపై టీడీపీ శ్రేణుల దాడి మరువకముందే గంగినేని గ్రామంలో ఆదివారం ఉదయం మరో ఘటన జరిగింది. వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం గంగినేని గ్రామంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో పాటు బాలు అనే టీడీపీ కార్యకర్త ఏకంగా వైఎస్సార్ సీపీ జెండాను తగలబెట్టి డ్రెయినేజీలో విసిరేశాడు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా గ్రామంలో టీడీపీ కార్యకర్తలు చేస్తున్న వికృత చేష్టలకు గ్రామస్తులు విస్తుపోయారు. ప్రచార కార్యక్రమం అనంతరం ఘటన విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ సర్పంచ్ పిల్లి రామారావు, ఎంపీటీసీ సభ్యుడు పిల్లి ప్రసాద్‌లు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓటమి భయంతోనే ఇటువంటి రెచ్చగొట్టే ఘటనలు, వ్యాఖ్యలు చేసి ప్రశాంతంగా ఉంటున్న గ్రామంలో వివాదాలు సృష్టించేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



విస్సన్నపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

విస్సన్నపేట: తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) విజయాన్ని కాంక్షిస్తూ విస్సన్నపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆదివారం గడప గడపకు ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అలీరహమాన్, కో–ఆప్షన్ సభ్యుడు జాఫర్‌బాబా, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, నాయకులు పాల్గొన్నారు.

నూజివీడు సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావు



మండలంలో ప్రచారం చేస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు

ముసునూరు: నూజివీడు వాసిని, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా జీవిస్తూ, ట్రిపుల్ ఐటీ, కృష్ణా జలాలు, మ్యాంగో పరిశోధనా కేంద్రం, ఎమ్మార్ అప్పారావు కాలనీ, కేంద్రీయ విద్యాలయం సాధించానని, మరిన్ని బహుళ ప్రయోజక పథకాలను సాధించి, నూజివీడు నియోజకవర్గాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ మండల, యూత్ అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, గూడ్రు రంగారావు ఆధ్వర్యంలో ముసునూరు మండలం వేల్పుచర్ల, చిల్లబోయినపల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతాప్ మాట్లాడుతూ జననేత జగనన్నకు అధికారాన్ని అందించి ఈ రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం ద్వారా నూజివీడు నియోజకవర్గాన్ని సంపూర్ణ అభివృద్ధిలో నడుపుదామని పిలుపు నిచ్చారు. వేల్పుచర్ల, చిల్లబోయినపల్లి గ్రామాల్లో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, వ్యవసాయ గోదాము మంజూరు చేశామన్నారు. నూజివీడు వాసిగా, దివంగత వైఎస్సార్ శిష్యునిగా, జీవితాంతం వైఎస్సార్ సీపీ నేతగా, 24 గంటలూ అందరికీ అందుబాటులో ఉంటూ, నూజివీడు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చిల్లబోయినపల్లి, అన్నపనేనివారిగూడెం, కొత్తూరు, వజ్రంపాడు తదితర శివారు గ్రామాల్లో ద్విచక్రవాహనంపై తిరుగుతూ ప్రజలను పలుకరిస్తూ, ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, మహిళల ఆదరణ తనలో ఉత్సాహాన్ని మరింత రెట్టింపు చేస్తున్నాయని ప్రతాప్ అన్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా యువకులు బాణసంచా, బైక్‌లపై సందడి చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు, మహిళలు అధికంగా తరలి రావడంతో వీధులన్నీ రద్దీగా మారాయి. కార్యక్రమాల్లో నూజివీడు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ కంబాల కృష్ణవేణి, వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, సభ్యుడు అబ్బూరి రంగారావు, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి, స్థానిక సర్పంచ్ మోహనరావు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ కాండూరి శ్రీరామచంద్ర, గ్రామ పార్టీ అధ్యక్షుడు దేవేంద్రనాథ్, రవి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా, మేనిఫెస్టోపై అవగాహన

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీలోని 13వ వార్డులో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా పరిశీలన నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో జరిగిన సంక్షేమం, వైఎస్సార్ సీపీ ప్రకటించిన మేనిఫెస్టోలపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు వాళ్ల సురేష్, నాయని కోటేశ్వరరావు, ఇనపనూరి రవి పర్యవేక్షించారు.

లక్ష్మీపురంలో పోలీసుల కవాతు



తిరువూరు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరువూరు మండలంలోని లక్ష్మీపురంలో పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరుగుతాయని తెలుపుతూ ఏసీపీ మురళీమోహన్, ఇన్‌చార్జి సీఐ రాంబాబు, తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణల ఆధ్వర్యంలో ఈ కవాతు జరిగింది. పారా మిలిటరీ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు మేలు జరిగేలా ప్రభుత్వ పాలన

జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి

రెడ్డిగూడెం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు మేలు జరిగిందని రెడ్డిగూడెం జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి అన్నారు. జగనన్న ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. మండలంలోని మద్దులపర్వ గ్రామంలో ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు, విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) విజయాన్ని కోరుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. విజయభాస్కరరెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావాల్సి ఉందని చెప్పారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బలగాని తిరుపతిరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చాట్ల రామారావు (ఏసు), పాలంకి రమణారెడ్డి, పాలంకి సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోటి కృష్ణ, మాజీ ఎంపీటీసీ కొలుసు గంగాధర్, మాజీ వైస్ సర్పంచ్ బొమ్మిన సత్యనారాయణ, తొర్లికొండ వెంకట రమణ, దాసరి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివారి కల్యాణం



నందిగామ: మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయ సమీపంలో నిర్మించిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయ రెండో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు దాములూరి శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల అదృశ్యం

చాట్రాయి: తల్లీబిడ్డల అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన బర్రె విజయకాంత్ అదే గ్రామానికి చెందిన మిద్దె ఆమనిని తొమ్మిదేళ్ల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. రెండేళ్లుగా వేధిస్తుండటంతో మనస్థాపం చెందిన ఆమని ఈ నెల 25న పిల్లలతో కలిసి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఆదివారం ఆమని అన్నయ్య మిద్దె హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఎన్టీఆర్ జిల్లా సీపీ రామకృష్ణ ఆకస్మిక తనిఖీ



నందిగామలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ రామకృష్ణ

నందిగామ: విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్(సీపీ) పీహెచ్‌డీ రామకృష్ణ సూచించారు. నందిగామ పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు పరిశీలించారు. అనంతరం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, కేవీఆర్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ రామకృష్ణ మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏసీపీ డాక్టర్ రవికిరణ్, ఇన్‌స్పెక్టర్ హనీష్ ఉన్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరం

మైలవరం: మైలవరంలోని గ్రేడ్–2 గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 7వ తేదీ వరకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 31వ వార్డు, శాంతినగర్‌లోని చింతామణి అభయాంజనేయ స్వామి ఆలయంలో కీర్తి ధ్వజ, నవగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు పరాశరం సురేష్ ఆచార్యులు పర్యవేక్షణలో ఆలయ పురోహితులు జొన్నాభట్ల సతీష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ప్రతిష్ఠాపన మహోత్సవంలో విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను దంపతులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్ (చిన్నా), 31వ వార్డు సచివాలయ కన్వీనర్ గింజుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

267 మద్యం సీసాలు స్వాధీనం

జగ్గయ్యపేట:ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ మణికంఠరెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని చిల్లకల్లు గ్రామంలో మద్యం అక్రమంగా నిల్వచేసినట్లు సమాచారం అందడగంతో ఎస్‌ఈబీ సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు సీఐ వివరించారు. గ్రామానికి చెందిన గొట్టెముక్కల పార్వతి నివాసంలో 267 మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం సీసాలను గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు, పీట్ల వెంకటేశ్వరరావు సరఫరా చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఈ కేసుకు సంబంధించి సదరు మహిళను అదుపులోకి తీసుకోగా, మిగిలిన ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.